11

# గుండె జబ్బుతోనున్న సంఘం

## (2:1-7)

ఎఫెసు సంఘ కూడికలో ఉన్నట్టు ఊహించు. మీ ప్రియమైన సహోదరుడగు యోహాను యొద్దనుండి ఉత్తరం వచ్చిందన్న సమాచారం వ్యాపించింది. ఉత్తరం చదువగా వినడానికి సంఘం కూడింది.[1] సందేశం తెచ్చిన వ్యక్తి నిలిచియుండగా ముందుకు చెవియొగ్గి వినడానికి కనిపెట్టుతున్నావు.

### వందన వచనం (2:1ఎ)

అతడు చదువుతున్న ముందు పలుకులు "ఎఫెసులో ఉన్న సంఘపు దూతకు [వర్తమానికునికి ][2] ఈలాగు వ్రాయము" (1ఎ వ.). ఈ సంఘమునకు తొలిగా అడ్రస్ చేయబడింది ఎందుకంటే, "ఏడు పట్టణాలలోను ఎఫెసు అతి ప్రాముఖ్యమయ్యింది"[3] "ఆసియా యొక్క ఆభరణమని" అది పిలువబడింది. ప్రపంచములో ఆ ప్రాంతానికి అది వర్తక కేంద్రమైయుంది. ప్రాచీన ప్రపంచ వింతలలో ఒకటైయుండిన డయానా గుడికి అది నిలయమైయుంది. ఆ పట్టణం మహా ఘనమయ్యింది, నాగరికమయ్యింది, ధన వృద్ధిగలదైయుంది.[4] 1989లో నేను నా భార్య జో, మిక్కిలి పెద్దదైన నర్తక శాల శిథిలాల మీద నిలిచి, ప్రాచీన ఎఫెసు పాల రాతి వీధుల్లోగుండా నడిచిన సమయానికి నా మనస్సు వెళ్లుతుంది.[5] టర్కీలో మేము సందర్శించిన ప్రాచీన చోట్లు అన్నిటిలో, ఎఫెసు శిథిలాలను మించింది లేనట్టుంది.[6]

సువార్త వ్యాపకంలో కూడ ఎఫెసుకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. పౌలు దాదాపు అక్కడ మూడు సంవత్సరాల కాలము గడిపినట్టున్నాడు (అపో. 19:1-22; 20:31).[7] ఆ కాలమందు "యూదులేమి గ్రీసుదేశస్థులేమి ఆసియలో కాపురమున్నవారందరు ప్రభువు వాక్యము వినిరి" (అపో. 19:10). ఏడు సంఘాల్లో ఎక్కువ దాదాపు ఆ కాలంలోనే స్థాపింపబడియుండవచ్చు. తరువాత, పౌలు యెరూషలేమునకు వెళ్లుచుండినప్పుడు, అతడు ఎఫెసు స్థానిక సంఘ పెద్దలను పిలిపించుకొని "శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు" అంటూ అబద్ధ బోధలు చేసేవారిని గూర్చి హెచ్చరించాడు (అపో. 20:30). పౌలు రోమా చెరలో ఉండగా, ఎఫెసు సంఘానికి అతడు ఒక ఉత్తరం వ్రాశాడు. పౌలు విడిపింపబడిన తరువాత, అతడు తిమోతిని ఎఫెసులో ఉంచి, "సత్యమునకు భిన్నమైన బోధ చేయవద్దని" కొందరికి ఆజ్ఞాపించవలసిందిగా అతని హెచ్చరించాడు (1 తిమోతి 1:3). కొద్ది సంవత్సరాల తరువాత, ఎఫెసు అపొస్తలుడైన యోహానుకు నివాస స్థలమైయ్యింది.

అతడు అక్కడ ఇరవై, ముప్పై సంవత్సరాలు జీవించాడు. దైవికమైన ప్రేమయు ప్రయాసమును అక్కడ అధికంగా పెట్టాడు.

## యేసుని గూర్చిన వర్ణన (2:1బి)

రచయిత యిలా కొనసాగించాడు: "ఏడు నక్షత్రములు తన కుడిచేత పట్టుకొని యేడు దీపస్తంభముల మధ్య సంచరించువాడు చెప్పు సంగతులేవనగా" (1బి వ.). (పేజీ 109 చూడు.)

ఈ వర్ణన 1వ అధ్యాయంలోని దర్శనం మీద ఆధారపడినదై, ఎఫెసు సంఘం ఎరుగవలసిన రెండు వాస్తవాలను గూర్చి తెలియజేస్తుంది.

### ఆయన శక్తి మరియు కాపుదల

మొదటిగా, తమ బలము కొరకు వారు యేసు ప్రభువుపై ఆధారపడినట్టు అది నొక్కి చెప్పుతుంది. నక్షత్ర రాసులను డొమిషియన్ కుమారుడు తన చేత పట్టుకొనియున్నట్టు ఒక నాణ్యాన్ని డొమిషియన్ ముద్రించాడు. అంటే, విశ్వం యొక్క గతి అతనిమీద ఆధారపడియున్నట్టు అందులో గుప్తం చేశాడు. డొమిషియన్ గాని, అతని వారసులు గాని కారు, క్రీస్తే తన కుడిచేతిలో నక్షత్రాలు పట్టుకొనియున్నట్టు ఎఫెసీయులు తెలిసికొనవలెనని క్రీస్తు కోరారు. క్రీస్తు సమస్తమును తన స్వాధీనంలో ఉంచుకొన్నవాడై యున్నాడు.

2:1లో "పట్టుకొని" అనేది 1:16లో ఉపయోగింపబడిన పదం కంటె బలీయమైంది[8]; తన "అదుపులో గట్టిగా ఉన్నట్టు" అది సూచిస్తుంది.[9] సంఘములను భద్రంగా[10] యేసు ఉంచుకున్నారు. యేసు యొక్క శక్తియు, ఆయన కాపుదలయు నొక్కి చెప్పబడింది. నేడు, మన బలము కొరకు, వ్యక్తులుగాను స్థానిక సంఘాలు గాను మనం ఆయన మీద యింకను ఆధారపడియున్నాం.

### ఆయన ప్రసన్నత, ఎరుగగల శక్తి

రెండవది, తమ చర్యల విషయంలో వారు ప్రభువునకు లెక్క చెప్పవలసినవారై యున్నట్టు ఆయనను గూర్చిన వర్ణన ఎఫెసీయులకు జ్ఞాపకం చేస్తుంది. 1వ అధ్యాయంలోని దర్శనంలో, "దీపస్తంభముల మధ్య" యేసు *నిలిచియున్నట్టు* యోహాను చూచాడు (1:13); ఈసారి ఆయన దీపస్తంభముల మధ్య *సంచరించుచున్నట్టు* వర్ణింపబడ్డారు. ఆయన నడుచుచుండగా, ఆయన సంఘములను పరీక్షిస్తున్నారు – వారికున్న బలాన్ని గమనిస్తూ, వారి బలహీనతలను చూస్తూ, ఆత్మ సంబంధమైన వారి స్థితిని నిర్ధారణ చేస్తున్నారు. క్రీస్తువారి ప్రసన్నత, ఆయన జ్ఞానము యిక్కడ నొక్కి చెప్పబడింది.

యేసు యింకను తన సంఘముల మధ్య సంచరించుచున్నారా? అవును. ఆయన చేస్తున్నారు. బలములు, బలహీనతలను గుర్తించుతూ ఆయన తనిఖీ ప్రయాణాన్ని యింకను కొనసాగిస్తున్నారా? అవును. ఆయన చేస్తున్నారు. నీవు, నేను ఆరాధించే స్థానిక సంఘాలను సందర్శించినప్పుడు ఆయన ఏమి చూస్తారు? ఎక్కువ ప్రాముఖ్యమైనది. నీ హృదయాన్ని,

నీ మనస్సును ఆయన తనిఖీ చేసినప్పుడు ఆయన ఏమి కనుగొంటారు? తనను సంతోషపరచే దేన్ని ఆయన నీయందు కనుగొంటారు? తనను దుఃఖపరచే దేనిని ఆయన నీయందు కనుగొంటారు?

పరలోకంచే అధికారంపొందిన ఒకే సంఘ - తనిఖీ అధికారి యేసే. ఆయనకు మాత్రమే హక్కుంది,[11] ఆ పనిని సరిగా చేసే బాధ్యత, ఆధారాలు[12] ఆయనకు మాత్రమే ఉన్నాయి. దోషాన్ని కనిపెట్టి దాన్ని క్రమపరచాలని ప్రభువు మననుండి ఎదురు చూస్తారు (2:2, 6), కాని సంఘ - తనిఖీదారులుగా సహోదరుల మధ్య మనలను మనమే నియమించుకునే శోధనను మనం ప్రతిఘటించాలి. మన చేతులనిండ మనలో ఎక్కువ మందికి పొరపాట్లున్నాయి, మనం ఆరాధించే స్థానిక సంఘాల్లోనే అనేక లోపాలు ఉంటాయి.

## మెప్పు (2:2, 3, 6)

పాఠకుడు కొనసాగిస్తుండగా, ఎఫెసీ సంఘం మెప్పు పొందుతుంది. గతంలోని పద ప్రయోగంలోనే యిది ముడివేయబడింది: "నీ[13] క్రియలను నేనెరుగుదును"[14] (2వ వ.). "ఎరుగుదును" అని తర్జుమా చేయబడిన మాటకు, "సంపూర్ణమైన తెలివి, పరిపూర్ణంగా ఎరుగుట" అని అర్థం.[15] "నీవు చేసిన ప్రతిదీ నేనెరుగుదును" అని CEV తర్జుమా చేసింది. మనము ఎవరికి లెక్క చెప్పవలసియున్నదో "ఆయన కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగా కనబడుచున్నవి" అనే విషయం ఎఫెసులోని క్రైస్తవులు గ్రహించవలసియుంది (హెబ్రీ. 4:13). మనం కూడ దానిని గ్రహించవలసిన అవసరముంది.


ఎఫెసు సంఘంలోని సద్లక్షణాలతో యేసు ప్రారంభించారు. మనం ఒక స్థానిక సంఘాన్ని గాని, వ్యక్తిని గాని ఎదుర్కొన్నప్పుడు, నిజంగాను, యథార్థంగాను మెచ్చుకోగల వ్యక్తిగతమైన సద్లక్షణాలను గుర్తించుచూ ఆరంభించాలి.

### పరిచర్య, స్థిరముగ నిలిచియుండుట

మొదటిగా యేసు ఆ సంఘము యొక్క పరిచర్యను, స్థిరత్వాన్ని మెచ్చుకున్నారు: "-నీ క్రియలను నీ కష్టమును నీ సహనమును నేనెరుగుదును"[16] (2వ వ.). "కష్టము" అనే పదం "అలసిపోవునంతగా పడే ప్రయాస" అని అర్థమిచ్చే పదంనుండి తర్జుమా చేయబడింది.[17] చేయవలసిన పని ఉన్నప్పుడు, తమ చేతులు ముడుచుకుని నిలిచినవారు కారు. దానికి బదులు, తమ కండరాలు నొప్పి పుట్టేవరకు, తమ బట్టలు చెమటతో తడిచేవరకు శ్రమించిన ప్రజలవలె ప్రయాసపడ్డారు.

పైగా, పని కష్టమైనప్పుడు, వారు పని చేయకుండ మానలేదు. 3వ వచనంలో ప్రభువు యింకను యిలా అన్నారు, "నీవు సహనము కలిగి నా నామము నిమిత్తము భారము భరించి అలయలేదనియు నేనెరుగుదును." "అలయలేదనియు" అనే ప్రయోగము "కష్టము"నకు ఉపయోగించిన గ్రీకు పదము ఒకటి (2 వ.). "తమ శ్రమ విషయమై అలసిపోకుండ అలసిపోయేవరకు శ్రమించారు" అని ఒక వ్యక్తి అన్నాడు. మనకందరికి ఈలాటి గుణలక్షణం అవసరం! (గలతీ. 6:9; 2 థెస్స. 3:13 చూడు.)

మానవ శరీరాన్ని ఉదాహరణగా ఉపయోగిస్తూ, ఎఫెసీ సంఘమునకు బలీయమైన కుడిచేతి పరిచర్య ఉందని మనం చెప్పవచ్చు.




**ఆరోగ్యమైన, వేరుచేయబడిన**

తరువాత యేసు వారి మంచి స్థితిని గూర్చియు[18] వ్యత్యాసమును గూర్చియు మెచ్చుకున్నారు: "నీవు దుష్టులను సహింపలేవనియు, అపొస్తలులు కాకయే తాము అపొస్తలులమని చెప్పుకొనువారిని పరీక్షించి వారు అబద్ధికులని నీవు కనుగొంటివనియు" (2బి, సి వ.). "సహనము" అనే పదం 2వ వచనంలోను 3వ వచనంలోను ఉపయోగించబడింది:[19] వారు అలసిపోయేవరకు శ్రమించినా సహించారు. అయితే అబద్ధ బోధను సహించ నిరాకరించారు.

"క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును వారు మందను కనికరింపరు" అని పౌలు ఎఫెసు పెద్దలను ముందుగనే హెచ్చరించాడు (అపొ. 20:29). "గొఱ్ఱె చర్మములు కప్పుకున్న కొందరు తోడేళ్లు" తాము "అపొస్తలులమని" చెప్పుకుంటున్నారు (2 కొరింథీ. 11:13 చూడు). తొలిగా వారు మంచి యింప్రెషన్ను కలిగించవచ్చు (మంచిగా ఒప్పించవచ్చు) ఒప్పించే యోగ్యతా పత్రాలు కలిగియుండవచ్చు. పామరుల ఆలోచనను తమ తట్టుకు త్రిప్పివేయనూవచ్చు. ఏదియెలాగున్నా, ఎఫెసు సంఘం ముందుగానే హెచ్చరింపబడినదైయుంది. పౌలు హెచ్చరికతో పాటు, యోహాను యిలా రాశాడు, "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" (1 యోహాను 4:1). క్రొత్తగా వచ్చినవారి ఉపదేశాన్ని ఎఫెసీయులు దేవుని వాక్యముతో పోల్చి పరీక్షించి యుండవచ్చు (అపొ. 17:11). నిజమైన "అపొస్తలుల సూచనలను [అద్భుతములను] కనుపరచుడని" "అపొస్తలులమని" చెప్పుకొంటున్నవారిని వారు సవాలు చేసియుండవచ్చు (2 కొరింథీ. 12:12).[20]


ఆ అబద్ధ ఉపదేశకుల విషయంలోనే వారు అక్కర చూపినవారు కారు, దానికి తోడు ఆ ఉపదేశకుల ప్రభావంలో కూడ ఎఫెసీయులు అక్కర చూపినవారైయున్నారు. వారు అబద్ధికులని కనుగొన్నారు. "నీకొలాయితుల క్రియలు నీవు ద్వేషించుచున్నావు; నేనుకూడ వీటిని ద్వేషించుచున్నాను" అని 6వ వచనంలో ప్రభువు సూచించారు. నీకొలాయితులు అనేవారు అబద్ధ ఉపదేశకులు. వారు భక్తిహీనమైన జీవితాలు జీవించుతూ, యితరులను కూడ ఆలాగే బ్రదుకమన్నారు. పెర్గమునకు పంపిన ఉత్తరంలో, నీకొలాయితుల ఉపదేశాన్ని "బిలాము ఉపదేశానికి" సంబంధమున్నట్టు ప్రభువు సూచించారు. "విగ్రహములకు బలియిచ్చినవాటిని తినునట్లును, జారత్వము చేయునట్లును, ఇశ్రాయేలీయులకు ఉరి యొడ్డుమని బాలాకునకు నేర్పిన బిలాము బోధ" (2:14, 15).[21] నీకొలాయితులను, ఆది జ్ఞానతత్వవాదుల గుంపుగా[22] Hippolytus గుర్తించాడు. వారు

అవినీతిని జరిగిస్తారు.[23] వారి భక్తిహీనమైన సిద్ధాంతం న్యాయ సమ్మతంగా కన్పించడానికి గాను, తాము నీకొలాసుచే బోధింపబడినవారైయున్నట్టు నీకొలాయితులు చెప్పుకుంటారు. అతడు ఆది సంఘపు ఏడుగురు "పరిచారకులలో" ఒకడు (అపొ. 6:5).[24]

"ద్వేషించుట" అనే పదాన్ని గుర్తించు: "నీకొలాయితుల క్రియలు నీవు ద్వేషించు చున్నావు; నేనుకూడ ద్వేషించుచున్నాను" అని యేసు చెప్పారు. దేవుడు దుష్టత్వాన్ని ద్వేషిస్తాడు (సామెతలు 6:16–19), మనం కూడ దుష్టత్వాన్ని ద్వేషించాలని ఆయన మననుండి ఎదురు చూస్తాడు (రోమా 12:9). ఏదియెలాగున్నా, ఎఫెసీయులు నీకొలాయితులను ద్వేషించలేదు, నీకొలాయితుల క్రియలను వారు ద్వేషించారు. వారి ఆచరణను ద్వేషించి, ఆ ప్రజలను వారు ప్రేమించారు. మనలో ప్రతి ఒక్కరు పాపమును ద్వేషించి, పాపులను ప్రేమించవలసియుంది. రోగి దేహాన్ని నాశనం చేసే క్యాన్సర్‌ను డాక్టర్ ద్వేషిస్తాడు, కాని రోగిమీద దయగలవాడైయుంటాడు.

"సహించలేవనియు" అనే ప్రయోగం – అబద్ధ ఉపదేశకులు వారి మధ్య ఉండడానికి ఎఫెసీయులు అనుమతించలేదు అని సూచిస్తుంది. వారు దోషాన్ని ఎత్తి చూపి, వారితో సహవాసం చేయక మానరు (2 థెస్స. 3:6; 1 కొరింథీ. 5:6–11; మత్తయి 18:17 చూడు). వారి తత్వాన్ని Homer Hailey ఈ మాటలతో వ్యక్తపరచాడు: "[నీకొలాయితులు] రూపాంతరం చెందినట్టయితే, వారు బదిలీ చేయబడవలసియుంటారు."[25]

"భరించలేరు" అనే మాటలను AB "సహించలేరు" అని తర్జుమా చేస్తుంది. నేటి లోకంలోని అనేక ప్రాంతాలలో, ఆలాటి ప్రతిపాదన "రాజకీయంగా తప్పు" అని తీర్పు తీర్చబడుతుంది. సహనము మెప్పు పొందుతుంది, అసహనము నేరంగా ఎంచబడుతుంది. కాని తన అసహనానికి, – ప్రత్యేకంగా, పాపాన్ని సహించలేకపోవడాన్ని బట్టి క్రీస్తు సంఘాన్ని శ్లాఘించారు. పాపమునకు వ్యతిరేకంగా "మరణమగునంతగా" మనం పోరాటంలో ఉన్నాం (ఎఫెసీ. 6:11; ప్రకటన 12:17); మనం రాజీ పడలేం.




మానవ దేహాన్ని ఉదాహరణగా ఉప యోగించడాన్ని కొనసాగించుతూ, ఎఫెసు సంఘము *బలమైన ఎడమచేతి క్రమశిక్షణ* కలిగియుంది.

ఇప్పటివరకు వర్ణింపబడిన గుణలక్షణాలను బట్టి చూస్తే మనలో ఎక్కువ మంది ఆ స్థానిక సంఘంలో సభ్యులుగా ఉండడానికి బహుగా యిష్టపడతాం. అయితే తనిఖీ చేయబడిన రిపోర్టు యింతటితోనే పూర్తి కాలేదు.


## నేరస్థాపన (2:4)

ఎఫెసులో మనం ఊహించిన సమాజ కూటమిలో హాజరైనవారందరు ముఖాలమీద చిరునగవుతో, ఒకరితో నొకరు తలలు ఆడించుకునేవారైయుంటారు. ఒకవేళ కొందరు

ఆలోచిస్తూ ఉండవచ్చు. "ఇంతకంటె మనలను గూర్చి మనమే గొప్పగా చెప్పుకోలేమని" అనుకోవచ్చు. చదువరి తన మాటలను కొనసాగిస్తుండగా చిరునవ్వులు అంతరించాయి. "నేను నీమీద తప్పు ఒకటి మోపవలసియున్నది" (4ఎ వ.). "అయినను మొదట[26] నీకుండిన ప్రేమను నీవు వదిలితివని"[27] నేను నీమీద తప్పు ఒకటి మోపవలసియున్నది అని ప్రభువు కనుగొనడంలో స్తంభించిన నిశ్శబ్దం వారి మీద పడింది (4బి వ.).

ఈ క్రైస్తవులకు బలీయమైన కుడిచేతి పరిచర్య, బలమైన ఎడమచేతి క్రమశిక్షణ ఉంది గాని, వారికి *గుండె జబ్బు* ఉంది.[28]

పరిపూర్ణమైన ఆరోగ్యం గలవాడైయున్నట్టు కన్పించి చిన్న లేక ఏ హెచ్చరికయు లేకుండ చనిపోయిన ఎవనినైనా నీవు ఎరుగుదువా? నేను మా మామగారిని గూర్చి ఆలోచిస్తున్నాను. ఆయనకు కేవలం ఆహారం అరుగుదల తక్కువ అన్నట్టుగా ఉండి, ఏభైయైదేండ్ల వయస్సులోనే పెద్ద గుండెపోటు వచ్చి చనిపోయాడు. ఆత్మ సంబంధంగా, ఎఫెసు సంఘం ఆరోగ్యంగా ఉన్నట్టు కన్పిస్తుంది. అది ప్రభువు కొరకు పని చేస్తుంది. అది సిద్ధాంత ప్రకారం ఆరోగ్యంగా ఉంది. అయితే దానికి మరణకరమైన లోప ముంది: గుండె జబ్బు.



**గుండె జబ్బు**

దేవుని పట్ల ప్రేమ లేక నరుల పట్ల ప్రేమ – యేసు యే ప్రేమను గూర్చి మాట్లాడు తున్నారు అనే విషయంలో వ్యాఖ్యానకర్తలు ఏకీభవానికి రాలేదు.[29] ఈ ప్రశ్న ప్రాముఖ్య మయ్యింది కాదు, ఎందుకంటే నిజమైన ప్రేమ యిరువైపుల పని చేస్తుంటుంది (1 యోహాను 4:20). ప్రభువువారి ప్రతిపాదనలో గుర్తింపదగినది "మొదటి" అనే పదం: "మొదట నీకుండిన ప్రేమను"[30] "నీవు మొదట ప్రేమించినట్టు యిప్పుడు ప్రేమించుట లేదు" అని ఫిలిప్స్ తర్జుమా అంటుంది.[31]

"మొదటి ప్రేమ" అనేదాన్ని అభినందించాలంటే, క్రొత్తగా పెండ్లి చేసికొన్న జంటను గూర్చి ఆలోచించు. వారి ప్రేమను నీవు ఎలా చిత్రిస్తావు? "అధికమైన," "ఉత్సాహ భరితమైన," "అమితమైన" అనే మాటలు మనస్సుకు వస్తాయి: ఆత్మ సంబంధంగా దానిని మార్చి చూస్తే, నీవు క్రైస్తవుడైనప్పటి సంగతి ఆలోచించు. నీవు బాప్తిస్మం పొందినప్పుడు ఎంతగా ఆనందించావో నీకు జ్ఞాపకముందా? ఆరాధనా కార్యక్రమాలను నీవు ఎంతగా ప్రేమించావో నీకు జ్ఞాపకముందా? ఇతరులకు సహాయము చేయడంలో అవకాశాలకు ఎలా స్వాగతం పలికావో నీవు జ్ఞాపకం చేసికోగలవా? నీ విశ్వాసాన్ని యితరులతో పంచుకొనడానికి నీవు ఎంతగా యిష్టపడ్డావో జ్ఞాపకముందా? ఆ సమయంలో నీ ప్రేమను నీవు వర్ణించి చూడు. "అధికమైన," "ఉత్సాహభరితమైన," "అమితమైన" అనే మాటలు వర్తించి యుండవచ్చు.

వివాహబంధంలోని ప్రేమ – దేవునితో మన సంబంధానికి సంబంధించిన ప్రేమ – దాని తీవ్రత అన్యోన్యత అనుకోకుండనే నిలుపుతుందా? అలా నిలువదని నీకు తెలుసు. వివాహానికి ఏమి జరుగగలదో నీవు చూచావు. ప్రేమ ప్రకాశవంతంగా వెలుగుతు ఆ

జంట యొక్క జీవితం ఆరంభమౌతుంది. తరువాత, కాలం గడిచేకొలది, అది పోషింపబడకుంటే, మంటలు క్రమక్రమంగా తగ్గిపోతాయి. ఆ జంట దాదాపు అదేవిధంగా కొనసాగవచ్చు; స్త్రీ మంచి భార్యగానుండ ప్రయత్నించవచ్చు, పురుషుడు కుటుంబ పోషణను చూడవచ్చు, కాని ప్రకాశవంతమైన మెరుపు లేకుండపోయింది. వారు "చలనముల గుండా పోతున్నారు"; వారి వివాహం అలవాటుగా మారిపోయింది.

ఆత్మ సంబంధమైన మన జీవితాలలో తీవ్రతను, అన్యోన్యతను మనం కూడ పోగొట్టు కొనవచ్చు. ఒక ఉదయాన మనం మేల్కొని ప్రభువు పక్షంగా మనం చేసే పనులు అలవాటుగా మారినట్టు గుర్తించవచ్చు, అందులో మన హృదయం లేకపోవచ్చు, ప్రేమను బట్టి కాక బాధ్యత అన్నట్టు కార్యాలను జరిగించవచ్చు.

"వివాహంలో గాని – క్రైస్తవ జీవితంలో గాని మొదటి ప్రేమ యొక్క ఉత్సాహము కొనసాగించడం నిజము కానిదైయుంటుందని కాలము మన ప్రేమను మందమగునట్టు చేసే విధానముంది. గనుక దాన్నిగూర్చి బాధపడవద్దు అని ఎవరైనా ఆక్షేపణ చెప్పవచ్చు." అది ప్రభువుకు అక్కర కలిగించిందా? "అయినను మొదట నీకుండిన ప్రేమను నీవు వదిలితివని నేను నీమీద తప్పు ఒకటి మోపవలసియున్నది" అని ఆయన అన్నారు (4 వ.). ప్రభువు దీని విషయమై అక్కర కలిగినప్పుడు, మనమును అక్కర కలిగి యుండవలసిన వారమైయున్నాము.

ప్రభువు అక్కరకు హేతువు తరువాత వచనంలో ఉంది.

## హెచ్చరిక మరియు బెదిరింపు (2:5)

"నీవు ఏ స్థితిలోనుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారుమనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము. అట్లు చేసి నీవు మారుమనస్సు పొందితేనే సరి; లేనియెడల నేను నీయొద్దకు వచ్చి నీ దీపస్తంభమును దాని చోటనుండి తీసివేతును" అనే ప్రభువువారి హెచ్చరిక మనం ఊహించిన స్థానిక సంఘపు ముఖాలు తీవ్రంగా మారిపోయాయి (5 వ). దీపస్తంభము అంటే స్థానిక సంఘమే (1:20). దీపస్తంభాన్ని తీసివేస్తానంటే, స్థానిక సంఘం ఉనికిలో లేకుండపోవడమనే అర్థం.[32] మాడిపోయిన బల్బుకు ఏమి గతి పట్టుతుంది? అది పారవేయబడుతుంది. ప్రేమ జ్వాలలేని దీపస్తంభానికి ఏమి జరుగు తుంది? అది త్రోసివేయబడుతుంది. "ఉజ్జీవింప చేయబడడం లేదా తీసివేయబడడం!" అని ఎఫెసు సంఘమునకున్న మార్గాలను గూర్చి Richard Rogers సంగ్రహం చేశాడు.[33]

దీన్ని ఎన్నడూ సందేహింపకు: గుండె పరిస్థితి తీవ్రమైయుండగా, చికిత్స జరుగకుంటే, మరణానికి దారితీస్తుంది! ఇది మానవ దేహం విషయంలో నిజం. వివాహం విషయం యిది సత్యం. ఇది స్థానిక సంఘ విషయంలో కూడ నిజమైయుంది. ఆలాగే మన ఆత్మల విషయంలోను యిది సత్యమైయుంది.

యేసు ఎఫెసీయులకు వ్యాధి నిర్ధారణను సూచించడం మాత్రమే గాక, వారికి వ్యాధి నివారణను కూడ ఆయన సూచించారు. గుండె జబ్బు బాగుపడడానికి వైద్యం మూడు రకాలైనది.[34]

**జ్ఞాపకము చేసికో[35]**

మొదట జ్ఞాపకాన్ని ఉపయోగించుకోవాలి: "ఏ స్థితిలోనుండి పడితివో అది జ్ఞాపకము[36] చేసికొనుము ..." (5ఎ వ.). నేను వివాహపు జంటకు సలహా యిచ్చేటప్పుడు, వారి తొలి దినాలను జ్ఞాపకం చేసికోమని చెప్పుతాను. "అప్పుడు మీరు ఎలా ఫీలయ్యారు?" అని నేనడుగుతాను. వారి బాంధవ్యం పునరుద్ధరించబడాలంటే, వారి తొలి దినాల ప్రేమ బంధం జ్ఞాపకం చేసికోమని చెప్పుతాను. వారు ఎంత పోగొట్టుకున్నారో, తమ తొలి ప్రేమను తిరిగి పొందడం ఎంత అవసరమో గుర్తించమంటాను.

ఆలాగే, ఆత్మ సంబంధంగా ఒక వ్యక్తి తన తొలి ప్రేమను విడిచినట్టయితే, క్రైస్తవుడుగా తన తొలి దినాలను జ్ఞాపకం చేసికోవలసిన అవసరముంటుంది. ఆ దినములలో ఉండే ఆనందం, ఉత్సాహాలను గుర్తు తెచ్చుకోవాలి. పైగా, తన పాపమునుండి రక్షించడానికి గాను ప్రభువు తనకు ఏమి చేశారో దాన్ని అతడు గుర్తు తెచ్చుకోవలసి ఉంటుంది. John Newton సువార్తికుడు కాకముందు, బహు ఘోరమైన పాప జీవితంలో జీవించాడు, బానిసల వ్యాపారిగా సముద్రాల్లో సంచరించాడు. అతడు మార్పు పొందిన తరువాత – "నీవు ఐగుప్తుదేశములో దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా నిన్ను విమోచించెనని జ్ఞాపకముచేసికొని ..." అనే వాక్యాన్ని రాసి తన వంట సామానుల బీరువా మీద తగిలించాడు (ద్వితీయో. 15:14).

**మారుమనస్సు పొందు**

తరువాత, చిత్తము లేక యిష్టము అందులో పాల్గొనాలి: "... మారుమనస్సు పొంది ..."[37] (5ఎ వ.). ఈ ఆజ్ఞను పట్టించుకోకుండ పోతామేమోనని, వచనం చివరిలో ప్రభువు ఈ ఆజ్ఞను మరల తెలిపారు: "నీవు మారుమనస్సు పొందితేనే సరి; లేనియెడల ... నీ దీపస్తంభమును దాని చోటనుండి తీసివేతును" (5డి వ.). మారుమనస్సు అంటే, "ఆలోచనలపై [ఆధారం చేసి] మనస్సు మార్చుకొనుట."[38] మనం ఏమి పోగొట్టుకున్నామో ఆలోచిస్తుండగా, మన అవసరతను మనం గుర్తించాలి, మార్చుకోవాలనే తీర్మానం చేసికోవాలి.

వివాహపు సమస్యలున్న జంటలకు సలహాలిచ్చేటప్పుడు, వారి వివాహపు స్థితి దాన్ని గూర్చి ఏమి చేయబోతున్నారో అనేదానంత ప్రాముఖ్యమైనది కాదని నేను నొక్కి చెప్పుతాను. ప్రేమ అనే నిప్పు కణాన్ని తిరిగి ప్రజ్వలింప వారు నిజంగా చేసికోగోరి నట్టయితే, ఎవరు ఏమి చేసినా, చెప్పినా వ్యత్యాసమేమీ ఉండదు.

నిజమైన మారుమనస్సు ఆలోచించడం మీద ఆధారపడియుంటుంది, తీర్మానం యొక్క ప్రతిఫలంగా వస్తుంది – ఈ సందర్భంలో, మొదటి ప్రేమను నీవు పొందడానికి, దేవుని సహాయంతో, నీవలన అయినదంతా చేద్దామని తీర్మానించుకొని కొనసాగడమే.

**తిరిగి చెప్పు[39] (లేక చేయు)**

చివరిగా, బలము, సామర్థ్యములు పనిలో పెట్టాలి: "... ఆ మొదటి క్రియలను చేయుము" (5సి వ.). తొలిగా, ఈ ఆదేశము వింతగా వినిపించవచ్చు. ఎందుకంటె,

ఆయన కొరకు కష్టపడడం వారు మానలేదు (2:2, 3). అప్పుడు, ఆయన "ఆ మొదటి క్రియలను చేయుమని" ఎందుకు అన్నారు? మరోసారి కీలకమైన పదం "మొదటి" అనేదే. వారు "క్రియలు" చేస్తూనే ఉన్నారు. అయితే వారు తొలిగా మారిననాడు ఏ క్రియలు జరిగించారో అదే క్రియలను వారిప్పుడు చేయడం లేదు.

"మొదటి క్రియలకు" వ్యత్యాసంగా ఎఫెసు సంఘము ఏమి చేస్తుంది? క్రొత్తగా వివాహమైన జంట యొక్క ఉదాహరణ ఈ ప్రశ్నకు జవాబు చెప్ప సహాయపడవచ్చు: వారు తమ ప్రేమను వ్యక్తపరుచుకొన్న మార్గాలను గూర్చి ఆలోచించు: ప్రేమతో కూడిన మాటలు ఒకరికొకరు చెవ్వులలో గుసగుసలాడడం, "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అనే పలుకులు దినానికి మధ్యలో, కౌగిలింతలు, ముద్దులు; చిన్న చిన్న బహుమతులు; అప్యాయతతో కూడిన నోట్సు.[40] ఈలాటి సన్నిహితమైన కార్యాలు దురదృష్టావశాత్తు విడిచిపెట్టబడ్డాయి. యిద్దరు కలిసి చాలా సంవత్సరాలు గడిపినందున – యిందువలన మన వివాహాలు దెబ్బతింటాయి.

ప్రభువులో మనకు గల సంబంధానికి దీన్ని వర్తింపచేద్దాం: మనం తొలిగా క్రైస్తవులమైనప్పుడు ఉత్సాహముతో నింపబడియుండి, నేడు ప్రవర్తించేదానికి ఏమి వ్యత్యాసంగా చేసియున్నాం? ఆరాధనకు మనం పెందలకడనే నవ్వు ముఖాలతో వచ్చి యుండవచ్చు. మనకు చేతనైనంతగా యితర క్రైస్తవులను మనం దర్శించియుండవచ్చు. యేసు మనకొరకు ఏమి చేశారో దానినంతటిని మనం కలిసికొన్నవారికందరికి వివరించి ఉండవచ్చు – పరిచర్య చేసే సవాలులను అంగీకరించి ఉండవచ్చు. అయితే యిప్పుడు ఆ కాలమంతా గతించిపోయింది – ఆ "మొదటి క్రియలు" ప్రస్తుతం కేవలం జ్ఞాపకాలుగానే ఉండియుండవచ్చు – మన క్రైస్తవ్యం దెబ్బతినిపోయి ఉండవచ్చు.

మొదటి ప్రేమను తిరిగి పొందడానికి, ఎఫెసులోని క్రైస్తవులు ఆ మొదటి క్రియలను చేయవలసినవారైయున్నారు. ప్రేమ కార్యాలను చేయడం ప్రేమ తత్వాన్ని పునర్జీవింప జేసినట్లైతుంది. ఒక వ్యక్తి యిలా అన్నాడు, "నూతన విధానపు క్రియ చేయడం కంటె నూతన విధానపు ఫీలింగ్ నీకు నీవే కలిగియుండడం సులభం." ఇది వివాహంలో పని చేస్తుంది. ఒకరికొకరు తొలుత వ్యక్తపరచుకొన్న ప్రేమకు తిరిగి రావాలని వివాహపు సమస్యలు గల జంటను నేను ప్రోత్సహించుతాను.[41] వారు ఈ పని చేయనిష్టపడితే, ప్రేమను మరల జీవితంలో మెరిపించవచ్చు. ఈ సూత్రము ఆత్మ సంబంధమైన జీవితాల్లో కూడ పని చేస్తుందని ప్రభువు మనలను ఎరుగమంటారు.


## హెచ్చరిక (2:7ఎ)

ఉత్తరంలోని ఈ పాయింటు వద్దకు పాఠకుడు వచ్చేసరికి, శ్రోతలు ఆలకించుతూ, తలలు ఊపుతూ ఆలోచిస్తున్నట్టు నేను ఊహించుతాను. "అవును, సహోదరుడు రూఫస్ ఎక్కువ ప్రేమించువాడైయుండాలి." యేసు అలాటి బదులును ఎదురు చూస్తున్నారు: "చెవిగలవాడు **ఆత్మ** సంఘములతో చెప్పుచున్నమాట వినునుగాక[42]" (7ఎ వ.). మరోవిధంగా చెప్పాలంటే, "స్థానిక సంఘానికి ఈ ఉత్తరాన్ని అడ్రస్ చేశాను, కాని వ్యక్తులుగా నేను మీతో మాట్లాడుతున్నాను మీలో ప్రతి ఒక్కరు వ్యక్తిగతమైన వర్తింపు

చేసికొంటూ ఉండాలి" అన్నట్టు ఆయన అంటున్నారు.

## వాగ్దానం (2:7బి)

పులకరింపజేసే యేసు యొక్క వాగ్దానంతో పాఠకుడు ముగిస్తున్నాడు: "జయించు వానికి దేవుని పరదైసులో ఉన్న జీవవృక్ష ఫలములు భుజింప నిత్తును" (7బి వ.). ఏవో మార్పులు జరుగకున్నట్టయితే, ఆత్మ సంబంధమైన మరణం వేచియున్నట్టు యేసు ఎఫెసులోని క్రైస్తవులను హెచ్చరించారు. తన సవాలునకు వారు స్పందించినట్టయితే, ఆత్మ సంబంధమైన జీవితం తమదేయని యిక్కడ ఆయన వాగ్దానం చేస్తున్నారు. వేల సంవత్సరాలకు ముందు, పాపమును బట్టి నరులు జీవవృక్షానికి హక్కు కోల్పోయారు (ఆది. 3:24). అది మానవాళికి పునరుద్ధరింపబడుతుందని యిక్కడ ప్రభువు సూచించారు. దేవుని పరదైసులో – పరలోకమందు[43] జీవాన్ని నిలబెట్టే దాని పండ్లను (22:1, 2) రక్షింప బడినవారు (ఎంజాయ్ చేస్తారు) అనుభవిస్తారని ప్రకటన చివరి అధ్యాయం చిత్రిస్తుంది!



**జీవవృక్ష ఫలములు భుజింపనిత్తును (2:7)**

ఏదో ఒక దినాన, ఎఫెసీయులు జీవవృక్ష ఫలాలను తినగోరినట్టయితే, ప్రేమ జ్వాలను తిరిగి వారు వెలిగించవలసినవారై ఉంటారు. "జయించుట" (జయించిన) అనేది "గెలిచిన" అనే అర్థమిచ్చు గ్రీకు పదంనుండి వచ్చింది.[44] "తానున్నట్టు తన్ను తాను కనుగొనిన పరిస్థితులలో విజయవంతముగా జీవించుటయని దాని అర్థం."[45] ఈ ఉత్తరంలో వారి తొలి ప్రేమ బలాన్ని ఎఫెసీయులు పుంజుకొనడమై ఉందని సూచిస్తుంది.

## ముగింపు

మరోసారి, మనం ఊహించిన ఎఫెసు సంఘ కూడికకు తిరిగి వద్దాం. పాఠకుడు ఉత్తరం చదివి ముగించగా శ్రోతలు ఎలా స్పందించారు? చరిత్ర రికార్డుల ప్రకారం, ఆసియా అనే రోమా సామ్రాజ్యపు రాష్ట్రంలో ఎఫెసు సంఘం అనేక సంవత్సరాలు మంచికి బలీయమైన శక్తిగా పని చేసింది. ప్రభువైన యేసు యొక్క హెచ్చరికను తీవ్రంగా (సీరియస్‌గా) తీసికొని, కనీసం కొంత కాలం మంచిగా ఉన్నట్టు నేను ఆలోచింప గోరతాను.

ఈ ఉత్తరం వ్రాసి ఎక్కువ కాలం గడవక ముందే డొమిషియన్ చనిపోయాడు, యోహాను పరవాసంనుండి విడుదల పొందాడు. ఆనాటి రచయితల ప్రకారం, యోహాను తన మరణ పడకమీదనున్నప్పుడు, సహోదరులు ఒకరినొకరు ప్రేమించుకొనవలసిందిగా కోరాడట. "నీవు మాకు ఏదైనా క్రొత్త సంగతి చెప్పు"మని వారు ఆక్షేపణ తెలిపి యుండరేమో. తన తొలి పత్రికను కోట్ చేస్తూ యోహాను జవాబు యివ్వగలడు, "ప్రియులారా, మొదటనుండి మీకున్న పూర్వపు ఆజ్ఞనేగాని క్రొత్త ఆజ్ఞను నేను మీకు వ్రాయుటలేదు; ఈ పూర్వపు ఆజ్ఞ మీరు వినిన వాక్యమే ... మనమొకనినొకడు ప్రేమింపవలెననునది మొదటనుండి మీరు

వినిన వర్తమానమేగదా" (1 యోహాను 2:7; 3:11).

ఉత్తరాల్లో ఎఫెసు సంఘానికి వ్రాసిన ఉత్తరం బహు కలతపెట్టునదైనట్టు నాకు కన్పిస్తుంది, ఎందుకంటే ప్రభువును సేవించడంలో అది నాకున్న ఉద్దేశాలను చూచుకో మంటుంది. నేను జీవించే మార్గంలో నేనెందుకు జీవిస్తున్నాను. దేవుని సేవించడం ఆచారంగా లేక అలవాటు చొప్పున జరిగేదా? బాధ్యత అనే భావంతో నేను ఆరాధన చేస్తున్నానా? ప్రజలు నన్ను పొగడుతుంటారు గనుక నేను యితరులకు సహాయం చేస్తానా? లేక నేను ఆయనను ఆయన పనిని ప్రేమించినందున దేవుని ఆజ్ఞకు నేను లోబడతానా?

గుండె జబ్బును తెలిసికొనేంత కష్టం ఆత్మ సంబంధమైన మరి ఏ సమస్య ఉండదు. ఆత్మ సంబంధమైన మన ఆరోగ్యానికి అంత అపాయకరమైనది మరేదీ ఉండదు. లోపముగానున్న గుండె బాగుచేయబడనట్టయితే, మరణం తప్పదు. ఎఫెసు సంఘానికి వ్రాయబడిన ఉత్తరం మనలో ప్రతి ఒక్కని మీద కేకవేస్తుంది: భయంకరమైన గుండె చెక్కింగుకు గొప్ప వైద్యుని సంప్రదించడానికి యిది సరియైన సమయం![46]

నీవు నీ మొదటి ప్రేమను విడిచిన అవకాశముందా? అది ముదిరిపోకముందే, - సమస్య ఉన్నట్టయితే, నేడే దాన్ని తిరిగి వెలిగించుకొనడానికి ప్రారంభించు![47]

---

## ఉపదేశకులకు, సువార్తికులకు నోట్సు

ఏడు ఉత్తరాల మీద సువార్తికులు అనేకమైన తెలివిగల పేర్లను చిత్రించారు. ఎఫెసు సంఘ ఉత్తరానికి "తొలి ప్రేమ," "నమ్మకముగానుండియు లోటుపడిన," "ఒకటి తప్ప ప్రతిది," "మరణకరమైన లోపం," "హనీమూన్ అయిపోయింది!"

నా మెయిన్ పాయింట్ల కొరకు ఏడు ప్రధాన సూత్రాలను ఈ పాఠంలోను తరువాత దానిలోను నేను ఉపయోగించాను. మూడునుండి అయిదు పాయింట్ల ప్రసంగ శాస్త్ర విధానాన్ని నీవు అనుసరించవచ్చు. అనేకమంది రచయితలు/వక్తలు వందన వచనము వర్ణన పరిచయంలోను హెచ్చరిక వాగ్దానం ముగింపులోను ఉపయోగించి, ఉత్తరంలోని ప్రధాన భాగాన్నే అవుట్‌లైన్ చేస్తారు. ఎఫెసు ఉత్తరంలోని మధ్య వచనం ఎలా అవుట్ లైన్ చేయవచ్చునో యిక్కడ రెండు ఉదాహరణలున్నాయి: "అంగీకరించుట," "నేరారోపణ చేయుట," "చివాట్లు పెట్టుట"[48]; "మెప్పు," "విమర్శ," "ఆలోచన చెప్పుట."[49] అలాటి అవుట్‌లైన్స్‌లో మొదటి భాగం సాధారణంగా 2, 3, 6 వచనాలతోను; రెండవ భాగం 4వ వచనం; మూడవ భాగం 5వ వచనంతో సంబంధం కలిగి ఉంటాయి.

"ఏడు సంఘములకు ఉత్తరాలు"తో సంబంధం కలిగి 2:1-7ను ఉపయోగించడంతో పాటు వివాహంలోని ప్రేమ ఎలా పునర్జీవింప చేయబడాలో అనే సందేశంగా యిది ఉపయోగించవచ్చు: "అగ్ని కణాన్ని తిరిగి వెలిగించవచ్చా?" ఆలాటి భావాన్ని ఉపదేశించ డానికి వివాహపు ప్రేమకును, ఆత్మ సంబంధమైన ప్రేమకును మధ్య గల పోలికను విస్తరింపజేయుము.

## సూచనలు

[1]ఇతర ఉత్తరాలు ప్రకటన గ్రంథం అంతటితో కాకుండ వేరుగా ఎఫెసీయులకు ఉత్తరం పంపినట్లు మనకు ఏ రుజువూ లేదు. ఈ పాఠం కొరకు ఎఫెసీయులకు మాత్రమే ఉత్తరం చదువబడినట్టు చూచాం. [2]దూతల యొక్క గుర్తింపును గూర్చిన చర్చను చూడు. [3]Leon Morris, *Revelation*, rev. ed., The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987), 58. ఎఫెసును యోహాను తన నివాసంగా చేసికొన్న కారణాన కూడ అక్కడికి ఉత్తరం తొలిగా వ్రాయబడియుండవచ్చు – పౌలు ముందుగా జరిగించినట్టే. [4]ఎఫెసును సాధారణంగాను, డయానా గుడిని ప్రత్యేకంగాను ఎక్కువమంది రచయితలు చెప్పుకోదగినంత సమయాన్ని కేటాయించారు. (1) ప్రాచీన ప్రపంచంలో ఎఫెసు యొక్క ప్రాముఖ్యతను బట్టి (2) ఆ పట్టణం మీద ఎంతో సమాచారం లభ్యమౌతున్న దాన్ని బట్టి ఎఫెసు మీద నా రిమార్కులను రెండు కారణాలను బట్టి క్లుప్తం చేశాను: (1) బైబిలు విద్యార్థులకు కార్య గ్రంథం, ఎఫెసీ, 1 తిమోతి పత్రికలు చదివినప్పుడే ఎఫెసును గూర్చిన సందేశం లభ్యమైయుంటుంది. (2) పట్టణం యొక్క లక్షణాలు ఉత్తరం మీద ఎక్కువ వెలుగును ప్రకాశింపజేయవు. [5]అపొ. 19:29, 31లో అది "నాటక శాల" అని మాత్రమే చెప్పబడింది. [6]ఈ శిథిలాలు టర్కీలోని Selcuk అనే చోట ఉన్నాయి. [7]ఎఫెసు ఉన్న చోటును "ఆసియాలోని ఏడు సంఘాలు మరియు పత్మాసు ద్వీపము" అనే దేశ పటంలో చూడు. [8]In 1:16 the NASB "held" అని తర్జుమా చేసింది అయితే గ్రీకు పదానికి అక్షరార్థం "to have" (KJV చూడు). [9]Morris, 59. [10]ఏడు నక్షత్రముల అర్థానికి సంబంధించిన చర్చ యొక్క అర్థం కొరకు "మనుష్య కుమారుని పోలిన ఒకని" అనే పాఠంలో చూడు. నక్షత్రాలు ఏదో ఒక విధంగా స్థానిక సంఘాలను సూచిస్తున్నట్టున్నాయి అనే తీర్మానానికి వచ్చి చేరుకున్నాం (ఆ స్థానిక సంఘంలోని సభ్యులు).

[11]సంఘమునకు ఒకే శిరస్సు క్రీస్తు (ఎఫెసీ. 1:22, 23; కొలస్సీ. 1:18, 24). [12]మనవలె కాక, ఒకని అంతరంగంలో ఏమి ఉందో ప్రభువైన యేసుకు తెలుసు (యోహాను 2:24, 25); ఉద్దేశాలను తీర్పు తీర్చగల సామర్థ్యం ఆయనకే ఉంటుంది. [13]1వ వచనంలో "దూత" ఏక వచనాన్ని సూచిస్తుంది. అది ఒకే స్థానిక (ఎఫెసు) సంఘానికి ప్రాతినిధ్యమిస్తుంది. (పత్రిక) ఉత్తరమంతటిలో గ్రీకులో ఏక వచనమే ఉంది. [14]"నీ క్రియలు" అనేవి మంచి లేక చెడ్డ క్రియలను సూచిస్తుంది. [15]Homer Hailey, *Revelation: An Introduction and Commentary* (Grand Rapids, Mich.: Baker Book House, 1979), 120. [16]The KJV has "patience." This refers to "patient endurance." [17]William Barclay, *Letters to the Seven Churches* (Philadelphia: Westminster Press, 1957), 22. [18]"హితబోధను" సూచించే 2 తిమోతి 1:13; తీతు 2:1 మొదలైన లేఖన భాగాలున్నాయి: "హిత" అంటే ఆరోగ్యకరమైన, బలమైన, జబ్బులేని అని అర్థమిస్తుంది. [19]క్రియా కాలం మినహా, గ్రీకులోను, ఇంగ్లీషులోను అవే మాటలు. [20]"అపొస్తలులు" అని చెప్పుకున్నవారు తన యోగ్యతలను బట్టి పరీక్షింపబడ్డారు (అపొ. 1:21, 22). అపొస్తలులకు కొందరు వారసులమని చెప్పుకునేవారున్నారు, వారిని కూడ అదే అలాగే పరీక్షించవలసియుంటుంది.

[21]పెర్గమము సంఘ ఉత్తరాన్ని చదివేటప్పుడు బిలామును గూర్చి అధికంగా చెప్పబడుతుంది. [22]జ్ఞానతత్వవాదము రెండు, మూడు శతాబ్దాలలో విస్తరించింది, అయితే మొదటి శతాబ్దపు చివరి భాగంలో దాని సూత్రాలు ఉండేయి – వాటిని పౌలును, యోహానును యింక యితర క్రైస్తవ రచయితలు ఖండించారు. ఇతరులకు అందుబాటులో లేని జ్ఞానము తమకే ఉన్నట్టు జ్ఞానతత్వవాదులు అంటారు. [23]Earl F. Palmer, *1, 2, 3 John & Revelation*, The Communicator's Commentary Series, vol. 12 (Dallas: Word Publishing, 1982), 126. Hippolytus అనేవాడు "సంఘ పితరుడు" అని చెప్పుకునేవాడు (దైవ ప్రేరేపితం కాని క్రైస్తవ సాహిత్యాన్ని రాసి ఆది సంఘాన్ని బాగా ప్రభావితం చేసినవారిలో ఒకడు). [24]ఈ దోషం నిజంగా నీకొలాసునుండే వచ్చిందో లేదో మనకు తెలియదు. నీకొలాసు విశ్వాసంనుండి పడిపోయాడని కొందరు అంటారు మరికొందరు లేదని అంటారు. [25]Hailey, 121. [26]"ప్రేమ" అనే పదం *agape*నుండి తర్జుమా చేయబడింది (స్వార్థరహితమైన, సమర్పణతో కూడిన ప్రేమ). క్రైస్తవ గుణగణాలలో *agape* ప్రేమ మహా ఘనమైనది (1 కొరింథీ. 13:13; కొలస్సీ. 3:14). [27]"విడిచితివని" తర్జుమా చేయబడిన గ్రీకు పదం "బలీయమైనది; ఉత్సాహముతో కూడిన వారి ప్రేమను వారు సంపూర్ణంగా విడిచిపెట్టారని అది సూచిస్తుంది." (Morris, 60). [28]ఈ స్థానిక సంఘాన్ని ప్రభువు మెచ్చుకొనడంలోను, తప్పు చూపడంలోను సంబంధమున్నట్టును – వారి ఆసక్తి విమర్శించే స్థితికి దిగజారినట్టును కొందరు భావించారు. ఇది నిజమనేది నా సందేహం. ఎందుకంటే ప్రభువు వారి ఆసక్తిని మెచ్చుకున్నారు. అయితే సత్యం కొరకైన మన ప్రేమ తప్పు పట్టడం, మితిమించి విమర్శించడం కాకుండ చూచుకోవాలి. [29]ప్రేమ ఎవరి పట్ల – దేవునికా, క్రీస్తుకా లేక యితర మనుష్యులకా (సహ క్రైస్తవులతో చేర్చి) సూచించడానికి తర్జుమాదారులు కొన్ని పదాలను చేర్చారు. [30]దేవునికిని, నరులకును ఎఫెసీయులు కనుపరచిన ప్రేమ కొంతవరకు అపొ. 19లో కన్పిస్తుంది. వారు తమ మాంత్రిక

పుస్తకాలను కాల్చివేశారు. సువార్త వ్యాపకానికి సహాయపడ్డారు (10, 18–20 వచనాలు; ఎఫెసీ. 1:15; 6:24లను చూడు).

[31]*The New Testament in Modern English,* ed. J. B. Phillips (New York: Macmillan Co., 1958). [32]"తన నిజమైన సంఘంగా క్రీస్తుచే వారు గుర్తింపు పొందడం నిలిచిపోతుంది" (J. W. Roberts, *The Revelation to John [The Apocalypse],* The Living Word Commentary Series [Austin, Tex.: Sweet Publishing Co., 1974], 11). "దీపస్తంభాన్ని తీసివేస్తాననేదానికి" యితర వ్యాఖ్యానాలు కూడ యివ్వబడ్డాయి. అయితే యిది లేఖనానికి అనుకూలంగా ఉంది. నేడు ఏ సంఘము ఎఫెసు స్థలంలో లేదు. [33]Richard Rogers, "Letters to the Seven Churches, No. 1," *Video Series on Revelation* 4 (Lubbock, Tex.: Sunset Extension Department, 1990). [34]నలభై సంవత్సరాలు పైబడిన కాలంలో ఉన్న స్థానిక సంఘానికి ఉత్తరం వ్రాయబడింది. కొంత కాలంగా క్రైస్తవులుగా ఉండినవారికి హెచ్చరిక చేయబడింది. నూతనంగా వచ్చిన క్రైస్తవులైయుంటే, నొక్కి పలకడం వేరుగా ఉండవచ్చు. [35]ఆంగ్లంలో మూడు Rల్ల పాయింట్లను ఎవరు కనుగొన్నారో తెలియదు (Remember, Repent, Repeat). [36]"దీన్ని జ్ఞాపకముంచుకో" లేక "దీన్ని జ్ఞాపకముంచుకొంటూ ఉండు" అని తర్జుమా చేయవచ్చు. [37]ఆది భాషలో aorist క్రియా పదం యిక్కడ వాడబడింది. అంటే ఒక్కసారి జరిగిన కార్యాన్ని సూచిస్తుంది. పాపంతో తెగతెంపులు మారుమనస్సులో జరగాలి. [38]*Liddell and Scott's Greek-English Lexicon,* 25th ed., rev. and abr. (London: Clarendon Press, 1892), s.v. "*metanoia.*" [39]కొంతమంది రచయితలు Rనకు "Return" అని ఉపయోగిస్తారు. [40]మీ ప్రాంతంలోని జనులు తమ ప్రేమను వ్యక్తపరచేది వేరుగా ఉండవచ్చు. మీ పరిస్థితికి అనుకూలపర్చుకో.

[41]వారికి యింటివద్ద పిల్లలున్నప్పుడు, ఒంటరిగా సమయం గడపమంటాను. [42]ఈ హెచ్చరిక ప్రభువువారికి ప్రియమైనది. (ఉదాహరణకు, మత్తయి 11:15; 13:43; మార్కు 4:23; లూకా 14:35.) [43]"పరదైసు" అనేది పారసీక మూలంనుండి వచ్చినట్టు భావింపబడుతుంది. పారసీక రాజులు, ఘనులైనవారి ఉల్లాసపు తోటలు ఈ పదానికి మూలమైయున్నాయి. సెప్టూజంట్ ఈ పదాన్ని ఏదెను తోటను సూచించడానికి ఉపయోగించింది. ఇక్కడ అది పరలోకపు తోటను సూచిస్తుంది. మానవ స్థితి దేవుని ప్రసన్నతకు పునరుద్ధరింపబడిన స్థితిని తెలుపుతుంది. [44]ప్రకటనలో ఈ పదం కీలకమైనదైయుంది. [45]Ray Summers, *Worthy Is the Lamb* (Nashville: Broadman Press, 1951), 112. [46]దేవుడు హృదయాన్ని ఎరిగినవాడు (యిర్మీయా 17:10; 1 రాజులు 8:39; 1 దినవృ. 28:9; లూకా 16:15). మన ప్రార్థన కీర్తన. 139:23, 24లోని దావీదు ప్రార్థనవలె ఉండాలి. [47]జ్ఞాపకము చేసికొని, మారుమనస్సు పొంది, తిరిగి చేయడమనేది వర్తింపజేసికో. సంగతులను సరిచేసుకొనడం మారుమనస్సులో చేర్చబడ్డాయి (మానవ సాధ్యమైనంతవరకు). మీ శ్రోతలలో కొందరు సంఘముతో సరిపడవలసియుండవచ్చు (అపొ. 8:22; యాకోబు 5:16). ఈ పాఠం ప్రసంగంగా ఉపయోగించినట్టయితే, "ఈ పాఠం ఎక్కువగా క్రైస్తవేతరులకు కాక క్రైస్తవులకు ఉద్దేశింపబడిందని చెప్పు. క్రైస్తవేతరులను ప్రభువుకు లోబడమని చెప్పు (మార్కు 16:15, 16)." హృదయపూర్వకంగా లోబడాలని నొక్కి చెప్పు (రోమా 6:3–6, 17, 18). [48]John Risse, "Ephesus: The Real Loser," *The Book of Revelation Series,* vol. 1, Audiotapes (Abilene, Tex.: Southern Hills church of Christ, 1991). [49]Jay Lockhart, "The Letter to the Church at Ephesus," *Truth for Today* (March 1988): 6-9.

---

## రివ్యూ మరియు చర్చ కొరకైన ప్రశ్నలు

1. ఎఫెసు సంఘమునకు ముందుగా అడ్రస్ చేసింది ఎందుకని నీవు తలంచుతావు?
2. ఎఫెసు పట్టణాన్ని గూర్చి నీకు ఏమి తెలుసు? ఎఫెసు సంఘము ఎలా స్థాపించబడి ఎదిగింది?
3. ఈ ఉత్తరంలోని క్రీస్తు వర్ణనకు సంబంధించి ఎఫెసులోని క్రైస్తవులు ఏ రెండు సంగతులు తెలుసుకోవాలి?
4. సంఘముల మధ్య యేసు సంచరిస్తుండగా, నీవు హాజరయ్యే స్థానిక సంఘంలో ఆయన చూచేది ఏదని నీవు తలస్తున్నావు? అతి ప్రాముఖ్యంగా, ఆయన నీ

హృదయంలో ఏమి చూస్తున్నారు?

5. ఎఫెసు సంఘంలో మెచ్చుకోదగిన దేనిని యేసు చూచారు? ఈ లక్షణాలు స్థానిక సంఘాలన్నిటికి అవసరమేనా?
6. నీకొలాయితులు ఎవరు?
7. దేనినో ద్వేషించినందుకు ఎఫెసు క్రైస్తవులను ప్రభువు మెచ్చుకొనడం నీకు వింతగా ఉందా? క్రైస్తవులుగా మనం దేన్ని ద్వేషించాలి? మనం దేన్ని ద్వేషింప కూడదు?
8. ఎఫెసులోని సంఘం మంచిది అధికంగా చేసినా, "మరణకరమైన దాని దోషమేమి?" ఈ సమస్య ఎందుకు తీవ్రమైనది?
9. "మొదటి ప్రేమ" అనే ప్రయోగాన్ని చర్చించు. వివాహంలో "తొలి ప్రేమ" ఎలాటిది? క్రైస్తవ జీవితంలో "తొలి ప్రేమ" ఎట్టిదైయుంటుంది?
10. వివాహంలో గాని, ఆత్మ సంబంధమైన జీవితంలో గాని "తొలి ప్రేమలోని" ఉల్లాసపు తీవ్రత అనుకోకుండ అలాగే నిలిచియుంటుందా?
11. వారు మారుమనస్సు పొందనట్టయితే, వారి దీపస్తంభాన్ని తీసివేస్తానన్న ప్రభువు యొక్క హెచ్చరికకు ఆయన అర్థమేమయ్యుంటుందని నీ భావన?
12. ప్రేమ యొక్క ఆ నిప్పు కణాన్ని తిరిగి వెలిగించడానికి ప్రభువు యొక్క మూడు పాళ్లు వైద్యమేమి?
13. "ఆ మొదటి క్రియలు" చేయడానికిని "ప్రభువును కేవలం సేవించడానికిని" గల వ్యత్యాసమేమి?
14. ఎఫెసులో "జయించినవారికి" ప్రభువు చేసిన వాగ్దానాన్ని చర్చించు.
15. ఉత్తరాలన్నిటిలో "బహు కలతగానున్న ఉత్తరమని" ఎఫెసు సంఘ ఉత్తరం ఎందుకు పిలువబడింది.